సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం ; 19 ; మార్చి ; 2024



సోమశిలలో 12.044 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం నాటికి 12.044 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు 1000, ఉత్తరకాలువకు 600, దక్షిణకాలువకు 360 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు.




బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.67,490
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,061
3 శాతం జీఎస్టీతో..	రూ.6,243
నవర (8 గ్రా)	రూ.49,944

గరిష్టం/కనిష్టం
34.6 /25.2

వాతావరణం

సోమవారం గాలిలో తేమ 67 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతున్నాయి. మంగళవారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



న్యూస్‌రీల్

'నెమలి కన్నులు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరించిన డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్

వెంకటాచలం: హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షుడు దార్ల వెంకటేశ్వరరావు వెలువరించిన నెమలి కన్నులు పుస్తకాన్ని వెంకటాచలంలోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దార్ల వెంకటేశ్వరరావు తాను బాల్యం నుంచి అనుభవించిన జీవితాన్ని ఆత్మకథ ద్వారా అందరికీ తెలియజేయడం అభినందనీయమన్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టి విద్యావంతుడిగా గుర్తింపు పొందడానికి ఆయన పడిన శ్రమ ప్రశంసనీయమన్నారు. ప్రతిఒక్కరూ ఈ పుస్తకాన్ని చదవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేంద్రం విద్యాత్మక సిబ్బంది పాల్గొన్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.230

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 260 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా, 248 బేళ్లను కొనుగోలు చేశారు. 12 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్టంగా రూ. 230, కనిష్టంగా రూ. 223, సరాసరిన రూ.223 ధర పలికినట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ చెప్పారు. వేలంలో 14 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

మైనింగ్ అధికారుల తనిఖీలు

పొదలకూరు : మండలంలోని పలు మైన్లలో జిల్లా మైనింగ్ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. గతంలో ఉన్న మైన్లలో మైనింగ్ చేశారా..లేదా అనే దానిపై వీఆర్వోలను అడిగి తెలుసుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. మైనింగ్ డీడీ శ్రీనివాసకుమార్ తొలుత మొగళ్లూరు సమీపంలో ఉన్న మైన్‌ను పరిశీలించారు. అక్కడ ఎవరూ లేకపోవడంతో మరుపూరు సమీపంలో గ్రావెల్ తరలిస్తున్నారనే ఫిర్యాదుపై తనిఖీలు చేపట్టారు. మొగళ్లూరు సమీపంలోని పాతమైన్ వద్ద రెవెన్యూ అధికారులు తలారిని ఉంచారు. కాగా టీడీపీ నాయకుడు సోమిరెడ్డి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో మొగళ్లూరు సమీపంలోని మైన్ వద్దకు వెళ్లి నానాహంగామా సృష్టించారు. అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్నారని, అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు



ప్రజావైద్యశాలలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి

నెల్లూరు(అర్బన్): స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి హెచ్చరించారు. నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లోని స్కానింగ్ సెంటర్లను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారుల బృందం సోమవారం తనిఖీ చేసింది. రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల, సిద్దార్థ నర్సింగ్ హోం, మాతృత్వ ఫెర్టిలిటీ సెంటర్, వూంబ్ 9, తదితర ఆస్పత్రుల్లోని స్కానింగ్ కేంద్రాలను సందర్శించి పీసీపీఎన్‌డీటీ చట్టం నిబంధనలను పాటిస్తున్నారా..లేదా..అని రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ స్కానింగ్ పరీక్షలకు సంబంధించిన సమాచారాన్ని ప్రతిరోజూ జిల్లా వైద్యారోగ్య శాఖకు పంపాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ చట్టంపై అవగాహన కల్పించేందుకు బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో డెమో అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గిరిజనుల సొంతింటి కల సాకారం

ప్రభుత్వ సాయం రూ.1.80 లక్షలు

- ఒక్కో ఇంటికి అదనంగా మంత్రి కాకాణి రూ.15 వేలు అందజేత
- సర్వేపల్లిలో రెండు వేల మంది లబ్ధిదారులకు రూ.3 కోట్లు పంపిణీ
- వేగంగా గృహాలను నిర్మించుకుంటున్న గిరిజనులు

సొంతిల్లు సగటు మనిషి జీవితకాల కల. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో గూడుకు నోచుకోని గిరిజనుల సొంతింటి కలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాకారం చేసింది. నివేశన స్థలాన్ని మంజూరు చేయడంతో పాటు పక్కాఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలను అందజేసింది. గృహాలు కట్టుకోలేని వారికి నిర్మించి సైతం ఇస్తోంది. సర్వేపల్లి నియోజకవర్గంలోని గిరిజన గృహ లబ్ధిదారులకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అదనంగా రూ.15 వేలు చొప్పున అందిస్తూ వారికి చేయూతనిస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సర్వేపల్లి నియోజకవర్గంలో గిరిజనుల సొంతింటి కల సాకారమవుతోంది. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో గూడు లేకుండా చెట్ల కింద నివశిస్తున్న గిరిజనులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నివేశన స్థలాలను మంజూరు చేయడంతో పాటు పక్కాఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలను అందజేసింది. దానికి తోడు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఒక్కో ఇంటికి అదనంగా మరో రూ.15 వేలు అందజేస్తూ గిరిజనులకు చేయూతనిస్తున్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని పరిశ్రమల సీఎస్సార్ ఫండ్స్‌తో పాటు తన సొంత నిధులను వెచ్చించి గిరిజనుల సొంతింటి కలను సాకారం చేస్తున్నారు.

రూ.15 వేలు చొప్పున రూ.3 కోట్లు

సర్వేపల్లి నియోజకవర్గంలో ఇప్పటి వరకు పొదలకూరు, ముత్తుకూరు, మనుబోలు, వెంకటాచలం, టీపీగూడూరు మండలాల్లో రెండు వేల మంది గిరిజన మహిళా లబ్ధిదారులకు అదనంగా ఒక్కో ఇంటికి రూ.15 వేలు చొప్పున మంత్రి కాకాణి రూ.3 కోట్లు అందజేశారు. ఇటీవల నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి కాకాణి 84 కుటుంబాలకు చెందిన ఎస్టీ మహిళలకు రూ.12.60 లక్షల అదనపు సాయాన్ని అందజేశారు. గిరిజనుల సొంతింటి కల సాకారం కావాలనే ఉద్దేశంతో వారికి అదనపు నిధులు అందజేసి ప్రోత్సహించినట్లు మంత్రి వెల్లడించారు. గిరిజనులు గృహాలు నిర్మించుకునేందుకు ఎంత మంది ముందుకొచ్చినా రూ.15 వేలు వంతున సాయాన్ని అందజేస్తామని పేర్కొన్నారు.



పొదలకూరు మండలం పులికల్లు గిరిజన కాలనీలో నిర్మాణంలోని పక్కా ఇళ్లు



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న మంత్రి కాకాణి(ఫైల్)

మంత్రికి రుణపడి ఉంటాం



మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. ఆయన అదనంగా రూ.15 వేలు అందజేయకుంటే ఇంటిని నిర్మించుకోలేం. గత టీడీపీ ప్రభుత్వంలో సొంతింటిని కట్టుకుంటామని కాళ్లు అరిగేలా తిరిగినా పట్టించుకోలేదు. మంత్రి తమ బాధలు చూసి అదనంగా నగదు అందజేశారు.

– పాముల సత్యవతి, మల్లుగుంట సంగం కాలనీ, వెంకటాచలం మండలం

అదనపు నిధులతో ఇల్లు కట్టుకున్నా



గతంలో ఇల్లు లేక అనేక ఇబ్బందులు పడేవాళ్లం. జగనన్న ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు అందజేసింది. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అదనంగా మరో రూ.15 వేలు ఇవ్వడంతో ఇల్లు నిర్మించుకోగలిగాం.

– తుపాకుల రమణమ్మ, గిరిజనకాలనీ, మనుబోలు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

- కలెక్టర్ ఎం హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట)/నెల్లూరు(పొగతోట): ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరినారాయణన్ కోరారు. కలెక్టరేట్‌లోని ఎస్సార్ శంకరన్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల కోడ్ అమలుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికలకు సంబంధించిన నిబంధనలను క్షుణ్ణంగా తెలుసుకుని జిల్లా యంత్రాంగానికి తోడ్పాటును అందించాలని కోరారు. ఏప్రిల్ 18న ఫారం-1 విడుదల చేసి ఏ ఏ ప్రాంతాల్లో రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు స్వీకరిస్తారో తెలియజేస్తామన్నారు. పార్లమెంట్‌కు రూ.25 వేలు, అసెంబ్లీకి రూ.10 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మినహాయింపు ఉంటుందన్నారు. అభ్యర్థులు నామినేషన్ పత్రాలను ఎటువంటి తప్పులు, కొట్టివేతలు లేకుండా నింపాలన్నారు. రాష్ట్రంలో నాల్గో విడతలో పోలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఏప్రిల్ 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ, 26న నామినేషన్ల స్క్రూట్నీ, 29న నామినేషన్ల విత్‌డ్రా, మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియ ఉంటుందని వివరించారు. జూన్ 6తో ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నామినేషన్‌తో పాటు అఫిడవిట్‌ను అభ్యర్థులు ఫారం-26 ద్వారా అందజేసి రిటర్నింగ్ అధికారి సమక్షంలో ప్రమాణం చేయాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల దూరం వరకే వాహనాల ర్యాలీకి అనుమతి ఉంటుందని, ఆపై మూడు వాహనాలకు అనుమతి ఉంటుందన్నారు. ఆర్‌ఓ చాంబర్‌లోకి అభ్యర్థితో పాటు మరో నలుగురికి ప్రవేశం ఉంటుందని వివరించారు. భారీ ర్యాలీలు, సభలు, ప్రచారాలకు అభ్యర్థులు ముందస్తుగా ఆర్వో నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు.

ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరి

సాధారణ ఎన్నికల నేపథ్యంలో ప్రింట్ మీడియాలో ప్రచురించే, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారం చేసే అభ్యర్థుల ప్రకటనలు, బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెసేజ్‌లకు సంబంధించి తప్పనిసరిగా ఎంసీఎంసీ కమిటీ అనుమతి తీసుకోవాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. డీఆర్డీఏ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ మీడియా సెంటర్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ మీడియాలో పొలిటికల్ ప్రకటనలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. వార్తా పత్రికలు, టీవీల్లో ప్రసారమయ్యే పెయిడ్ ఆర్టికల్స్‌ను పరిశీలించి సమాచారాన్ని కమిటీ సభ్యులు అందజేయాలన్నారు. ఎన్నికల కమిషన్ పెయిడ్ న్యూస్, సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందన్నారు. దాని వల్ల ఎంసీఎంసీ కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సర్టిఫికేషన్ కోసం వచ్చే దరఖాస్తులను వరుస క్రమంలో పరిశీలించి అనుమతులు మంజూరు చేయాలన్నారు. దీనికి సంబంధించి ప్రత్యేక రిజిస్టర్‌ను నిర్వహించాలన్నారు. అనుమతి లేకుండా ప్రసారం, ప్రచురితమయ్యే ఆర్టికల్స్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డీఆర్వో లవన్న, ట్రెయినీ కలెక్టర్ సంజనాసింహ, సమాచార శాఖ డీడీ సదారావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు మురళీధర్ రెడ్డి, చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, రసూల్, శ్రీనివాస్, బాలసుధాకర్, అజయ్‌కుమార్, పెంచలనరసయ్య, నగేష్, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు



నెల్లూరులోని కుక్కలగుంట ఆదర్శ పాఠశాలలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

- తొలిరోజు 1282 మంది గైర్హాజరు

నెల్లూరు (టౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 29,339 మంది విద్యార్థులకు, 28,057 మంది హాజరయ్యారు. 1282 మంది గైర్హాజరయ్యారు. నగరంలోని ఎస్‌కేడీ బాలికోన్నత పాఠశాల, ఎస్‌సీసీఓ మున్సిపల్ హైస్కూల్, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల , లిటిల్ ఏంజిల్స్ హైస్కూల్, ఈఎస్సార్ మున్సిపల్ హైస్కూల్, పీఎస్ఎం మున్సిపల్ హైస్కూల్, ప్రభుత్వ మోడల్ హైస్కూల్, సంతపేటలోని సెయింట్ జోసెఫ్ బాలికల హైస్కూల్, రత్నం స్కూల్, దర్గామిట్టలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్ కేంద్రాల్లో పరీక్షల నిర్వహణను జిల్లా అబ్జర్వర్, జేడీ మువ్వా రామలింగం పరిశీలించారు. డీఈఓ పీవీజే రామారావు ప్రభుత్వ మోడల్ హైస్కూల్, పీఎంఆర్ మున్సిపల్ హైస్కూల్, లిటిల్ ఏంజిల్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ కేంద్రాలను తనిఖీ చేశారు. తొలిరోజు కావడంతో విద్యార్థులు ముందుగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షకు గంట ముందుగానే విద్యార్థుల హాల్ టికెట్లను నిశితంగా పరిశీలించి కేంద్రంలోకి అనుమతించారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు పరీక్ష కేంద్రాలకు వచ్చారు. పరీక్ష ముగిసి విద్యార్థులు బయటకొచ్చే వరకు కేంద్రాల వద్దే పడిగాపులు కాశారు. పరీక్ష సమయంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు 308 మంది గైర్హాజరు

ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా పదో తరగతి, ఇంటర్ పరీక్షలను 30 కేంద్రాల్లో నిర్వహించారు. తొలిరోజు పదో తరగతికి సంబంధించి 1646 మంది అభ్యాసకులకు, 1524 మంది హాజరయ్యారు. 122 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌కు సంబంధించి 3,320 మంది అభ్యాసకులకు, 3131 మంది హాజరయ్యారు. 186 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా డీఈఓ రామారావు 4 సెంటర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు 13 సెంటర్లను తనిఖీ చేశారు.

ఇంటర్ మూల్యాంకనం ప్రారంభం



అధ్యాపకులకు సూచనలు చేస్తున్న ఆర్ఐఓ శ్రీనివాసులు

నెల్లూరు (టౌన్): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనాన్ని నగరంలోని కేఏసీ జూనియర్ కళాశాలలో సోమవారం ప్రారంభించారు. వచ్చే నెల 6వ తేదీ వరకు మూల్యాంకనం జరుగనుంది. 18 నుంచి 21వ తేదీ వరకు ఇంగ్లిష్, తెలుగు, సంస్కృతం, సివిక్స్, మ్యాథ్స్, 22 నుంచి 25వ తేదీ వరకు ఫిజిక్స్, ఎకనామిక్స్, 26 నుంచి 27వ తేదీ వరకు కెమిస్ట్రీ, హిస్టరీ, 28 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు బోటనీ, జువాలజీ, కామర్స్ జవాబు పత్రాల మూల్యాంకనాన్ని నిర్వహించనున్నారు. 51 వేల ఇంగ్లిష్, 14 వేల తెలుగు, 38వేల సంస్కృతం, 6వేల సివిక్స్, 85వేల మ్యాథ్స్ జవాబు పత్రాలు ఇప్పటి వరకు జిల్లాకు చేరుకున్నాయి. జిల్లాకు అన్ని సబ్జెక్టులకు సంబంధించి 3.30 లక్షల జవాబు పత్రాలు రానున్నాయి. ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూల్యాంకనాన్ని నిర్వహించనున్నారు. ఒక్కో అధ్యాపకుడు రోజుకు 30 పేపర్లను మూల్యాంకనం చేయాల్సి ఉంది. తొలి రోజు 438 మంది అధ్యాపకులు మూల్యాంకనంలో పాల్గొన్నారు. తొలుత ఆర్ఐఓ శ్రీనివాసులు అధ్యాపకులకు మూల్యాంకన సమయంలో పాటించాల్సిన నియమనిబంధనలను తెలియజేశారు.

క్లుప్తంగా

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

• జేసీ సేతు మాధవన్

కోవూరు: నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోవూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలను పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుని వాటి ప్రకారం నడుచుకోవాలన్నారు. ఎక్కడా హోర్డింగులు, పోస్టర్లు, జెండాలు ఉండకూడదన్నారు. 18 సంవత్సరాల వయసు నిండి ఇంకా ఎవరైనా ఓటు నమోదు చేసుకోకపోతే దరఖాస్తు చేసుకునేందుకు ప్రస్తుతం అవకాశం ఉందన్నారు. నియోజకవర్గంలో తనిఖీల కోసం 16 బృందాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి మాట్లాడుతూ కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లాలంటే రసీదు ఉండాలన్నారు. లేకపోతే సీజ్ చేస్తామన్నారు. సమావేశంలో అధికారులు సీహెచ్ శ్రీనివాసరావు, లక్ష్మీరెడ్డి, తహసీల్దార్ విజయశ్రీ, ఎంపీడీఓ శ్రీరామాంజనేయులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో రూ.3.89 లక్షల చోరీ



మద్యం దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

ఆత్మకూరు: పట్టణంలో ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీ జరిగింది. ఎస్సై ముత్యాలరావు కథనం మేరకు.. సిబ్బంది ఆదివారం రాత్రి నగదును టేబుల్ సొరుగులో పెట్టి తాళం వేసి దుకాణాన్ని మూసివేసి ఇళ్లకు వెళ్లారు. వాచ్‌మెన్ ఆరు బయట మెట్లపై పడుకున్నాడు. ఈక్రమంలో సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు షాపు పక్క వైపు ఉన్న గోడకు రంధ్రం వేసి లోపలికి ప్రవేశించారు. లాకర్‌ను పగులగొట్టి రూ.3.89 లక్షల నగదును చోరీ చేశారు. ఉదయం వాచ్‌మెన్ గుర్తించి సిబ్బందికి తెలిపి పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్లూస్ టీం దుకాణం, పరిసరాల్లో పరిశీలించి ఆధారాలు సేకరించింది. కాగా ఆదివారం అర్ధరాత్రి సంగంలోని ఓ మద్యం దుకాణంలో ఇద్దరు వ్యక్తులు చోరీకి యత్నిస్తుండగా వాచ్‌మెన్, సమీపంలోని వారు గమనించి కేకలు వేయడంతో పరారయ్యారు. వారే ఆత్మకూరులోని దుకాణంలో చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

పొగాకు బ్యారెన్ దగ్ధం

• రూ.10 లక్షల ఆస్తి నష్టం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని ముస్తాపురం (తెల్లపాడు)లో నాదెళ్ల సుబ్బారావు అనే రైతుకు చెందిన పొగాకు బ్యారెన్ సోమవారం కాలి బూడిదైంది. క్యూరింగ్ చేస్తున్న సమయంలో మంటలు చెలరేగి ప్రమాదం జరిగింది. సమాచారం తెలుసుకున్న ఆత్మకూరు అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి వేశారు. కాగా మర్రిపాడు మండల డీసీపల్లి పొగాకు బోర్డు ఫీల్డ్ అధికారులు ప్రకాష్, దివ్య ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. రూ.10 లక్షలకుపైగా నష్టం వాటిల్లినట్లు రైతు బోరున విలపించారు. బోర్డు తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని అధికారులు తెలిపారు.

పరీక్షలు మొదలు..

పదో తరగతి పరీక్షలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు కావడంతో తల్లిదండ్రులు స్వయంగా కేంద్రాల వద్దకు పిల్లల్ని తీసుకొచ్చి జాగ్రత్తలు చెప్పారు. హాల్‌టికెట్ల నంబర్లు చూడడంలో సహాయపడ్డారు. అనేకమంది ఆలయాలకు వెళ్లి పూజలు చేయించుకున్నారు. కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



సందడి..: నెల్లూరు కుక్కలగుంట ఆదర్శ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బయట విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



హాల్‌టికెట్ తెచ్చావా..: విద్యార్థుల వివరాలు పరిశీలిస్తున్న సిబ్బంది



తల్లీ ఆశీర్వదించు..: సరస్వతీదేవికి నమస్కరిస్తున్న విద్యార్థి



ఎక్కడెక్కడ..: హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటూ..



రాయడానికి మేము రెడీ..: పరీక్ష హాల్లో విద్యార్థులు



మళ్లీ రండి..: కస్తూరి దేవి పాఠశాల వద్ద పరీక్ష అయ్యాక రండంటూ వాచ్ చూపుతూ సూచిస్తున్న విద్యాశాఖ అధికారి

వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయం

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

చేజర్ల: 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడిచేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయం' అని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాడేరు, బీవీకండ్రిక, సీవీకండ్రిక, చిత్తలూరు గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే విజయీభవ యాత్ర నిర్వహించారు. సీఎం జగన్ ఐదేళ్లలో చేపట్టిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. పాడేరులో విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ డీబీటీ, నాన్ డీబీటీ కింద రూ.8.97 కోట్ల వరకు ప్రజలకు అందజేయడం జరిగిందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా రూ.13.7 లక్షల విలువైన అభివృద్ధి పనులు చేశామన్నారు. 159 మంది భూ సమస్యలు పరిష్కరించామన్నారు. 16 బోర్లకు రూ.28 లక్షలు, జగనన్న లేఅవుట్లకు రూ.25 లక్షలు ఇచ్చామన్నారు. పాడేరులో దేవాలయానికి రూ.10 లక్షలు మంజూరు చేశామని తెలిపారు. చిత్తలూరు పంచాయతీలో సంక్షేమాభివృద్ధికి రూ.8.76 కోట్లు ఇచ్చామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా రూ.40 లక్షలను వివిధ పనులకు అందించామని తెలిపారు. నియోజకవర్గంలో అత్యధికంగా చిత్తలూరులో రెవెన్యూ సమస్యలు పరిష్కరించామన్నారు. 358 మందికి సంబంధించి 878 ఎకరాల్లో భూ సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత అభివృద్ధి చేశామన్నారు. సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి, జేసీఎస్ కన్వీనర్ పూనూరు బాలంగాధర్‌రెడ్డి, సర్పంచ్ గుమ్మా వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ జి.ప్రభావతి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, బి.సుధాకర్‌రెడ్డి, పి.రామమనోహర్‌రెడ్డి, రత్నమ్మ, హజరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

• వైఎస్సార్‌సీపీ ఉదయగిరి అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి

జలదంకి: 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారు. వచ్చే ఎన్నికల్లో సంక్షేమ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలి' అని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కోరారు. మండలంలోని కృష్ణాపాడు, సోమవరప్పాడు పంచాయతీల్లో సోమవారం ఆయన విజయ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఐదు సంవత్సరాల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. మంచి జరిగిన ప్రతి కుటుంబం వైఎస్సార్‌సీపీని ఆదరించాలన్నారు. తమ ప్రభుత్వంలో వివిధ పథకాల ద్వారా మండల ప్రజానీకానికి లబ్ధి చేకూర్చామన్నారు. పేదలకు ఎంతో మేలు చేసిన జగన్‌ను ఎలాగైనా అధికారంలోకి రాకుండా చేయాలని ప్రతిపక్షాలు ఏకమై ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయన్నారు. వారికి ప్రతి ఒక్కరూ ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలన్నారు. టికెట్ల కేటాయింపులో వైఎస్సార్‌సీపీ సామాజిక న్యాయం పాటించిందన్నారు. 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కేటాయించడం గొప్ప విషయమన్నారు. కోవిడ్ కష్టకాలంలో కూడా ప్రజలకు వైద్యసేవలతోపాటు, సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందించిన జగన్‌ను మరోసారి ఆదరించి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఉదయగిరి ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, నాయకులు చేవూరు శ్రీనివాసులురెడ్డి, డాకా గోపాల్‌రెడ్డి, వాసిపల్లి పద్మనాభరెడ్డి, కోటా వెంకటరమణారెడ్డి, ఆయేషా, ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, రావి ప్రసాద్ నాయుడు, సురె వెంకటశేషారెడ్డి, గుర్రం జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి, చిత్రంలో నాయకులు

• పెన్నాకు వరదల సమయంలో ముంపునకు గురవుతున్న భగత్‌సింగ్ కాలనీ
• రక్షణ గోడ నిర్మించాలని ప్రభుత్వం ఆదేశం
• రూ.100 కోట్లతో పనులు

ప్రజలకు రక్షణ



నిర్మాణంలో ఉన్న రక్షణ గోడ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ప్రతి సంవత్సరం నవంబర్, డిసెంబర్ వస్తే చాలు.. పెన్నా నది సమీపంలో ఉండే నెల్లూరు సిటీ పరిధిలోని 54 డివిజన్ ప్రజలు వణికిపోతారు. ఎగువ ప్రాంతాల నుంచే వచ్చే వరద నీరు తొలుత భగత్‌సింగ్ కాలనీ, తర్వాత జనార్దనరెడ్డి కాలనీని ముంచెత్తేది. దీంతో వేలాది మంది కట్టుబట్టలతో ప్రభుత్వ పునరావాస కేంద్రాలకు వెళ్లి తలదాచుకునే వారు. వరద తగ్గాక ఇంటికి వెళ్లి బురదను తొలగించుకునే వారు. ఈ పరిస్థితి నుంచి ప్రజలను కాపాడేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పెన్నా వద్ద రక్షణ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది.

ఇదీ జరిగింది

పెన్నా నదికి వరద వచ్చిన ప్రతిసారి ఎక్కువగా భగత్‌సింగ్ కాలనీ ముంపునకు గురికావడం, వందలాది ఇళ్లు మునిగిపోవడం, వేలాది మంది నిరాశ్రయులు కావడం ప్రతి సంవత్సరం జరిగేది. గతంలో ఏ నాయకుడూ అక్కడి ప్రజల బాధల్ని పట్టించుకున్న పాపానపోలేదు. చుట్టపు చూపుగా వచ్చి పరామర్శించి వెళ్లేవారు. ఈ ప్రభుత్వంలో సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకున్నారు. 2021 సంవత్సరం ఆఖరులో వరదలు వచ్చాయి. దీంతో ముంపునకు గురైన భగత్‌సింగ్ కాలనీకి సాక్షాత్తు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చారు. బాధితులను పరామర్శించారు. ఇక్కడి సమస్యను నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వరదల నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు రక్షణ గోడను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. మాట ఇచ్చినట్లే ఆయన రూ.100 కోట్లను మంజూరు చేశారు. దీంతో ఆ కాలనీ చుట్టూ రక్షణ గోడ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇంకా వెంకటేశ్వరపురం నుంచి పెన్నా నదిలోకి వర్షపునీరు నీరు వెళ్లేందుకు నిర్మించిన ప్రధాన కాలువలో ప్రజలు పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో కాలువ చుట్టూ ఫెన్సింగ్ నిర్మించారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న సీఎం జగన్ (ఫైల్)

భయం ఉండదు



పెన్నా నదికి వరదలు వస్తే బిక్కుబిక్కుమంటూ ఉండేవాళ్లం. చాలాసార్లు రాత్రికి రాత్రి మా ప్రాంతమంతా మునిగిపోయేది. ఇళ్లు మునిగిపోయేవి. ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా ప్రాంతానికి వచ్చి పరామర్శించారు. ఆయన వల్ల భగత్‌సింగ్ కాలనీ ముంపునకు గురికాకుండా రక్షణ గోడ నిర్మిస్తున్నారు. భవిష్యత్‌లో వరదలు వస్తే భయం లేకుండా ఉండొచ్చు.

– జైనుల్లా, భగత్‌సింగ్ కాలనీ

నేడు సర్వసభ్య సమావేశం

నెల్లూరు(బృందావనం): నెల్లూరు భక్తవత్సలనగర్‌లోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంక్షేమ భవనంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఆ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌ఎం గౌస్, ఎస్వీవీఎస్ మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ అంశాలపై చర్చిస్తామన్నారు. డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాలకు చెందిన సీనియర్ వైద్యుడు ఎంవీ రమణయ్య వేసవి కాలంలో పెన్షనర్లు, వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మధుమేహం వ్యాధిపై అవగాహన కల్పిస్తారన్నారు. జిల్లాలోని పెన్షనర్లు హాజరవ్వాలని కోరారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 115
లేయర్ (లైవ్)	: 73
బ్రాయిలర్ చికెన్	: 206
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 230
లేయర్ చికెన్	: 125

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.75
సన్నవి : రూ.70
పండ్లు : రూ.25

కొత్త వాహనం ఇవ్వాలని ఆదేశం

నెల్లూరు(దర్గామిట్ట): తక్కువ మైలేజ్ ఇస్తున్న ఎలక్ట్రిక్ స్కూటర్‌ను వెనక్కు తీసుకుని కొత్తది ఇవ్వాలంటూ ఉమ్మడి నెల్లూరు జిల్లా వినియోగదారుల కోర్టు న్యాయమూర్తి జింకారెడ్డి శేఖర్ సోమవారం తీర్పు చెప్పారు. తప్పుడు ప్రకటనలతో మోసం చేయొద్దంటూ కంపెనీ నిర్వాహకులను హెచ్చరించారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నెల్లూరుకు చెందిన బెల్లపు సురేష్‌బాబు 2022 మార్చి ఏడో తేదీన ఫిడటో ఈవీ కంపెనీకి చెందిన ఈజీగో ప్లస్ మోడల్ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను నెల్లూరులోని సాయి సుదర్శన్ ఎలక్ట్రిక్ ఆటోమొబైల్స్ షోరూంలో రూ.87 వేలతో కొనుగోలు చేశాడు.

100 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుందని కొనుగోలు సమయంలో కంపెనీ ప్రతినిధులు సురేష్‌బాబుకు చెప్పారు. అయితే నడుపుతున్న సమయంలో మైలేజ్ 50 కిలోమీటర్లు మాత్రమే రావడాన్ని అతను గమనించాడు. కొనుగోలు చేసిన పదిరోజుల్లోనే సెన్సర్ పనిచేయడం ఆగిపోయింది. మరమ్మతులు చేయించాలని, లేదా కొత్త వాహనం ఇవ్వాలని చాలాసార్లు అభ్యర్థించినా కంపెనీ వారు పట్టించుకోలేదు. దీంతో సురేష్‌బాబు జిల్లా వినియోగదారుల కోర్టును ఆశ్రయించాడు. కేసును విచారించిన శేఖర్ స్కూటర్ మైలేజ్ విషయంలో తప్పుదోవ పట్టించడం తగదని హెచ్చరించారు. కొత్త వాహనాన్ని 45 రోజుల్లోగా ఇవ్వాలంటూ తీర్పు ఇచ్చారు.



మాట్లాడుతున్న జింకారెడ్డి శేఖర్